

మహిళకు ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళకు ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేత

సరూర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 9వ డివిజన్‌కు చెందిన కందికంటి ప్రసన్నకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పట్టాను మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కందాడి శ్రీరాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ శుక్రవారం అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ అంకంగారి వెంకటేశ్‌గౌడ్, నాయకులు పుట్టగల్ల జగన్, బంగారి అశోక్, వెంకటేశ్‌యాదవ్, మర్రి లింగారెడ్డి, బంగారి మురళి, రాజు, జగదీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను అడ్డుకుంటున్న సాహెబ్‌నగర్ వాసులు

పైప్‌లైన్ పనులను అడ్డుకున్న కాలనీవాసులు

వనస్థలిపురం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): బతుకమ్మకుంటకు ఔట్‌లెట్ ఏర్పాటు చేయకుండా వరదనీటి పైపులైన్ పనులు చేపట్టడాన్ని సాహెబ్‌నగర్ వాసులు అడ్డుకున్నారు. శుక్రవారం సాహెబ్‌నగర్ బతుకమ్మ కుంట వద్ద అధికారులు వరదనీటి పైపులైన్ పనులను చేపట్టడంతో అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ ముద్దగౌని చంద్రకాంత్‌గౌడ్ మాట్లాడుతూ పై కాలనీల నుంచి వచ్చే వరద నీటిని బతుకమ్మ కుంటలోకి మళ్లిస్తే కుంటతో పాటు సమీప కాలనీలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. పనులను నిలిపివేయడంతో స్థానికులు అక్కడి నుంచి వెనుతిరిగారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 6వ వార్డుకు చెందిన గంగయ్య అనే వ్యక్తి గ్రామ కంఠం స్థలంలో రెండు అంతస్తుల భవనానికి అనుమతి తీసుకొని నాలుగు అంతస్తులతోపాటు పెంట్‌హౌస్ నిర్మిస్తున్నాడు. భవనం ఒకవైపు ఒరిగిందని, ఇళ్లపై కూలే ప్రమాదం ఉందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే మునిసిపాలిటీ ఇంటి నంబర్ కేటాయించి, పన్ను కట్టించుకుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణానికి అడ్వాన్స్‌గా ఇంటి నంబర్‌ను కేటాయించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గౌతం నగర్, ఆజంపురా, పల్టాన్, అరుంధతి కాలనీ, సూపర్‌బజార్ స్టార్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీనగర్, అరుంధతి కాలనీ ఫీడర్ల పరిధిలో, ఏసీపీ ఆఫీస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పతేషా నగర్, సింగరేణి కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, శంకర్ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మూసారాంబాగ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ పేర్కొన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేసిన విజయ్‌కుమార్ తదితరులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్‌లు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బండరావిరాల ప్రభుత్వ పాఠశాలలో గుండోజీ రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందికంటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు స్టడి మెటీరియల్, పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రంగదాసు స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, ఆంజనేయులు, భిక్షపతి, దానేష్, యాదగిరి, జగన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలీ కార్తీక వన మహోత్సవ అభినందన సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

రేపు కార్తీక వన మహోత్సవం

వనస్థలిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే కార్తీక వన మహోత్సవ అభినందన సభను విజయవంతం చేయాలని వనస్థలిపురం పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మ్యాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రచ్చ లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం ఎన్జీవోస్ కాలనీలో వనస్థలిపురం పద్మశాలీ భవన్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక వన మహోత్సవాన్ని తుర్కయంజాల్ చెరువుకట్ట కింద కట్టమైసమ్మ ఆలయం ఎదురుగా ఉన్న వనస్థలిపురం పద్మశాలీ భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గర్దాసు సుదర్శన్, కోశాధికారి ఎక్కలదేవి మురళీ, అప్పం చంద్రమౌళి, జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ సమస్యల పరిష్కారానికి పోరాడతాం'

మన్సూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ సమస్యల పరిష్కారానికి పోరాడతామని ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మూషం నరహరి పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా నరహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మోహన్‌నగర్ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవంలో కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు



మానస మానసిక దివ్యాంగుల సంస్థలో చిన్నారులతో మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు



కొత్తపేట జడ్పీ హెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓ సైదులు

ఘనంగా బాలల దినోత్సవం

కొత్తపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని శుక్రవారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మోహన్‌నగర్ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు టీచర్ల పర్యవేక్షణలో పాఠాలు చెప్పారు. కార్పొరేటర్ పవన్‌కుమార్, హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు, మోహన్‌నగర్ సంక్షేమ సంఘం నాయకుడు సత్యనారాయణ, బీజేపీ నాయకుడు వగ్గల సుందర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె. నర్సింహ, చైతన్యపురి ఎస్‌హెచ్‌వో కె. సైదులు, అడ్మిన్ భద్రయ్య సూచించారు. మోహన్‌నగర్‌లోని మానస మానసిక దివ్యాంగుల సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభాను, క్లినికల్ కో-ఆర్డినేటర్ బి.అనిత, సాక్ష్యం సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



భాష్యం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో భాష్యం స్కూల్ జెడ్‌ఈవో అంకమరావు

భాష్యంలో..

ఎల్బీనగర్: భాష్యం విద్యా సంస్థలు ఆర్‌కే పురం, దిల్‌సుఖ్‌నగర్ శాఖల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలను పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీలు, ఎస్‌ఏఐ పరీక్షల్లో, ఇతర విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థ చైర్మన్ రామకృష్ణ, సీఈవో చైతన్య, జెడ్‌ఈవో అంకమరావు, ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, భాష్యం విద్యాసంస్థల జోనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ అంకమరావు అన్నారు. మన్సూరాబాద్ ప్రలవి గార్డెన్స్‌లో శుక్రవారం వనస్థలిపురం భాష్యం పాఠశాల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలలు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ కె.సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో..

హయత్‌నగర్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హయత్‌నగర్‌లోని శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఏడవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఫర్హీన్ బేగం విద్యార్థులకు పండ్లు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల పిల్లల మధ్య బాలల దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన అలవాట్లను నేర్పించాలని సూచించారు.

కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ మహేష్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, న్యాయవాదులు సతీష్, రామ్మోహన్, అంజయ్య, పద్మ, సాంబశివుడు, బాలేశ్వర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఫర్హీన్ బేగం

హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ, ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, గ్రంథ పాలకుడు ఆనంద్ దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించండి

ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్రదాస్ సూచన



డాక్టర్ దేవేంద్రదాస్‌కు మొక్క అందజేస్తున్న కాలేజీ ప్రతినిధులు

సరూర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేయడానికి నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్(యూబీఏ) తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్రదాస్ సూచించారు. యూబీఏ ఫౌండేషన్ డే వేడుకల్లో భాగంగా శుక్రవారం నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించి స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన ఆవిష్కరణ రూపకల్పనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. కళాశాల కార్యదర్శి ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో యూబీఏ విభాగం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇక ముందు సైతం దీనిని కొనసాగిస్తామని, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. యూబీఏ విభాగం ప్రతినిధులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

49 మంది మందుబాబులకు కౌన్సెలింగ్

కొత్తపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి అన్నారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో శుక్రవారం 49 మంది మందుబాబులకు కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్‌ఓపీలు అమరవర్ధన్‌రెడ్డి, అల్లూరయ్యతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. టీటీఐ అధికారులు 6 ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హస్తినాపురంలోని 5 ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు, ఉద్యోగులకు కొత్తపేట హుండా కాంప్లెక్స్, సరూర్‌నగర్, మోహన్‌నగర్, నాగోల్ రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ ఆయా ప్రాంతాల్లో 584 మందికి అవగాహన కల్పించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో విజేతలకు హెల్మెట్లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ అర్జున్

బాలల దినోత్సవం సందర్భంగా మేడిపల్లి జడ్పీహెచ్‌ఎస్ నుంచి 48 మంది విద్యార్థులు ట్రాఫిక్ శిక్షణ పార్కును శుక్రవారం సందర్శించారు. వారికి ట్రాఫిక్ నిబంధనలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు హెల్మెట్లు అందజేశారు.



జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న మహిళలు



అనాజ్‌పూర్‌లో నిర్వహించిన సంబురాల్లో ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు

జూబ్లీహిల్స్‌లో విజయంతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఎల్బీనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజలు పట్టం కట్టారని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం సాధించడంతో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలిచ్చిన మద్దతుకు ఈ గెలుపు నిదర్శనమన్నారు. శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్‌రావు, మహేందర్ ముదిరాజ్, జూపల్లి ప్రవీణ్, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిఠాయిల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: జూబ్లీహిల్స్ ఉప ఉన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ సంబురాలను నిర్వహించారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంపాపేట: జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ విజయం సాధించడంతో చంపాపేట్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు గూడూరు గౌతంరెడ్డి ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టి, టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి చింటూ, తోకటి కిరణ్‌కుమార్, రంజిత్, వెంకటేష్, వినిత్‌రెడ్డి, రాజా, శివ, రోహిత్, నితీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దె జితేందర్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన కర్మన్‌ఘాట్‌లోని టీపీసీసీ సేవాదళ్ కార్యాలయంలో మాట్లాడారు.



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రం అందజేత

వనస్థలిపురం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వైదేహినగర్‌కు చెందిన చెరుకు శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. రూ. 1.15 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని బాధితుడికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఘనంగా కుంకుమార్చన

వనస్థలిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవోస్ కాలనీలోని శివమార్కండేయ స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించడం తమ అదృష్టమన్నారు.

ఈ-ఫైలింగ్‌పై న్యాయవాదులకు సదస్సు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు ఈ ఫైలింగ్‌పై శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్‌హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ ఫైలింగ్‌పై హైకోర్టు న్యాయవాది ముప్పు రవీందర్‌రెడ్డి న్యాయవాదులకు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ బాసెట్టి, సీనియర్ న్యాయవాదులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలి : జేఎంఆర్‌ఎఫ్

మన్సూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్లకు పాల్పడి అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఉన్మాద శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జైభారత్ ముస్లిం రెవల్యూషనరీ ఫోరం(జేఎంఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఎంఆర్‌ఎఫ్ కోకన్వీనర్లు ఖదిజ్హాసి షేక్ సలీం, ఖదిజ్హాసి రెహమాన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ ఒక్క మతానికో ఈ ఘటనను ఆపాదిస్తూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

రియల్ ఎస్టేట్ కార్యాలయంలో చోరీ

- రూ. 9 లక్షలు, 10 తులాల బంగారు నగలు అపహరణ

కొత్తపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ కార్యాలయంలో నగలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఎస్‌హెచ్‌వో వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్‌గుప్తా హస్తినాపురం ఓంకార్‌నగర్‌లో శ్రీదత్తసాయి డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను నిర్వహిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలో తాళాలు పగులగొట్టి కార్యాలయం టేబుల్ డ్రాలో భద్రపరిచిన రూ. 5 లక్షలు, 10 తులాల బంగారు నగలు, లాకర్‌ను ఎత్తుకెళ్లారు. రవీందర్ గుప్తా శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీలు, వేలిముద్రలను సేకరించారు. లాకర్‌లో రూ. 4 లక్షలు ఉన్నాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.